
సాక్షి మంచిర్యాల

గురువారం ◆ 8 ◆ జూన్ ◆ 2023



సీఎం సారూ పట్టించుకోండి

ఎల్లంపల్లి ప్రాజెక్టు, పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే సందర్శకులు వస్తున్నా సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



బస్‌స్టేషన్ విస్తరించేదెప్పుడో..!

జిల్లా కేంద్రం మంచిర్యాల బస్‌స్టేషన్‌లో సౌకర్యాలు మెరుగుపడక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్లాట్‌ఫారాలు లేక బస్సులు రోడ్లపైన నిలపాల్సి వస్తోంది. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 42.0 /30.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

విత్తుకు నకిలీ మకిలీ !



గత నెలలో కన్నెపెల్లి మండలంలో పట్టుబడిన వాహనంలో పైన ఉల్లిగడ్డ బస్తాలు, కింద నకిలీ విత్తనాలు



పట్టుబడిన నిషేధిత పత్తి విత్తనాలు (ఫైల్)

- ఆగని నిషేధిత పత్తి విత్తన దందా
- గుట్టుగా నిల్వ చేస్తూ రైతులకు విక్రయం
- మందమర్రికి చెందిన ఓ వ్యక్తి పట్టివేత

కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసులు(గత మే వరకు)

సంవత్సరం	కేసులు	పట్టుబడిన వారు	సీజ్ చేసిన విత్తనాలు(క్వింటాళ్ళు)	విలువ (రూ.లక్షల్లో)
2021	65	158	5.08	95.92
2022	13	27	1.48	27.97
2023	02	09	1.31	26.20

జిల్లాలో ఈ సీజన్‌లో వ్యవసాయ అధికారులకు పట్టుబడినవి

కన్నెపల్లిలో	8.10 క్వింటాళ్లు	తాండూరులో	3 క్వింటాళ్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/మంచిర్యాలఅగ్రికల్చర్: పత్తి విత్తనాన్ని నకిలీ మకిలీ వదలనంటోంది. జిల్లాలో గుట్టుగా నిషేధిత విత్తనాల అక్రమ దందా సాగుతూనే ఉంది. తాజాగా మందమర్రిలో ఓ వ్యక్తి నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్నారని ఉమ్మడి వరంగల్ నుంచి పోలీసులు వచ్చి అదుపులోకి సంచలనం సృష్టించింది. ఇంకా ఎవరెవరు ఈ దందాలో ఉన్నారనే కోణంలో విచారణ సాగుతోంది. మందమర్రి పట్టణం యాపల్, బురదగూడెం, సారంగపల్లికి చెందిన ముగ్గురు గతంలో నకిలీ విత్తనాలు అమ్ముతూ పట్టుబడ్డారు. మళ్లీ వారే దందా చేస్తున్నారా..? అనే కోణంలో విచారణ సాగుతోంది. రాష్ట్రంలో పలు చోట్ల సోదాలు చేస్తున్న క్రమంలోనూ జిల్లాకు చెందిన వారి పాత్ర బయటపడుతోంది. వరంగల్ పోలీసుల తనిఖీ కంటే ముందే భీమిని, కన్నెపెల్లి మండలాల్లోకి క్వింటాళ్ల కొద్దీ విత్తనాలు తరలించినట్లు తెలుస్తోంది. అక్కడి విత్తన సరఫరా ఏజెంట్లు రహస్య ప్రాంతాల్లో దాచి రైతులకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గత నాలుగేళ్లుగా నకిలీ విత్తనాలు రైతులకు అమ్ముతున్న వారిపై పోలీసుశాఖ కఠినంగా వ్యవహరించడం, పీడీ యాక్టుల నమోదుతో దందా తగ్గింది. అక్రమ దందాకు అలవాటు పడిన కొందరు రహస్య మార్గాల్లో రైతుల వరకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతీ సీజన్‌లో పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో మండలాల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలు పని చేస్తున్నాయి. వీటితోపాటు జిల్లాలో ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలోనూ నకిలీ విత్తనాలపై నిఘా పెట్టారు. నిషేధిత విత్తనాల విక్రయించొద్దని విత్తన, ఎరువుల డీలర్లను హెచ్చరించారు. విత్తన షాపుల్లోనూ తనిఖీలు చేస్తున్నారు.

మారుమూల గ్రామాలే అడ్డాలు

జిల్లాలో పత్తి అధికంగా సాగయ్యే బెల్లంపల్లి పరిధిలో తాండూరు, మందమర్రి, భీమిని, కన్నెపల్లి, కుమురంభీం జిల్లా పరిధిలో రెబ్బెన దహెగాం, పెంచికల్‌పేట, బెజ్జూరు మండలాల మారుమూల గ్రామాల్లో రైతుల ఇళ్లలోనే దాచి దందా చేస్తున్నారు. కొనుగోలు చేసిన రైతుల నుంచే మరికొందరికి చేరేలా సరఫరా చేస్తున్నారు. క్వింటాళ్ల కొద్దీ తెచ్చి, కిలోల చొప్పున అమ్మేస్తున్నారు. ఈ విత్తనాలకు ఎటువంటి ప్యాకెట్లు, తయారీ, గడువు తేదీ, కంపెనీ పేరు ఏవీ ఉండవు. బస్తాల్లో లూజుగానే తెచ్చి అమ్మేస్తున్నారు. కిలోకు రూ.1800నుంచి రూ.2వేల వరకు తీసుకుంటున్నారు. అమ్మిన వారికి కమీషన్లు ఇస్తున్నారు. ఇక ఈ విత్తనాలు కొనుగోలు చేసిన వారంతా మళ్లీ గ్లైఫోసెట్‌ను తప్పనిసరిగా కొనుగోలు చేస్తున్నారు. మారుమూల గ్రామాల్లో చాటుగా తరలిస్తున్నారు. కొన్ని చోట్ల స్థానిక లీడర్లు, పలుకుబడి ఉన్న వారే నిల్వ చేస్తున్నారు. గతంలో భీమిని, కన్నెపల్లి మండలాల్లో ఓ నాయకుడి కనుసన్నల్లో వ్యాపారం సాగింది.

కలుపు తప్పుతుందనే..

కలుపు నివారణిగా హెటీ(హెర్బిసైడ్ టాలరెంట్) జన్యుమార్పిడి విత్తనాలు నిషేధం ఉన్నా కొనుగోళ్లు జరుగుతున్నాయి. పత్తి చేనులో కలుపు మందు గ్లైఫోసెట్‌ను పత్తి మొక్కలు తట్టుకుంటాయనే కారణంతో రైతులు ఈ విత్తనాలకు ఆసక్తి చూపుతున్నారు. ఈ విత్తనం మొలకెత్తాకా, గడ్డి నివారణకు గ్లైఫోసెట్‌ను పిచికారీ చేస్తారు. గడ్డి మాత్రమే చనిపోయి, మొక్కలకు ముప్పు ఉండదు. దీంతో వర్షాధారం, ఎకరాల కొద్దీ పత్తి సాగు చేస్తున్న రైతులకు గడ్డి బాధ తప్పి పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని, గుర్తింపు లేని విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విత్తనాలను నిషేధించినా, ఆంధ్రా ప్రాంతం నుంచి గుట్టుగా రవాణా అవుతూనే ఉన్నాయి. సీజన్ సమీపిస్తుండడంతో విత్తనాల కొనుగోలు కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. విత్తనాలు మొలకెత్తాక గడ్డిమందును సైతం మహారాష్ట్ర నుంచి చాటుగా తెచ్చుకుంటున్నారు. దీంతో ఏటా సీజన్‌లో చట్ట విరుద్ధమైన విత్తనాలకే కొందరు రైతులు మొగ్గుచూపుతున్నారు. నిషేధిత విత్తనాలు, గ్లైఫోసెట్‌తో వచ్చే అనర్థాలపై రైతులకు మరింత అవగాహన, గడ్డి నివారణకు సులభ యాజమాన్య పద్ధతులు వ్యవసాయ అధికారులు ప్రచారం చేయాల్సి ఉంది.

పుష్ప సినిమాను తలపించేలా..

నకిలీ విత్తనాల సరఫరాకు కొత్త పంథా అనుసరిస్తున్నారు. మందమర్రి మండలంలో ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం కొంత కాలంగా ఈ వ్యాపారమే వృత్తిగా ఎంచుకుని సాగిస్తున్నారు. ఎక్కడికి విత్తనాలు చేరవేస్తున్నారో అక్కడి అధికారులను మచ్చిక చేసుకుంటున్నారు. పుష్ప సినిమాను తలపించేలా ఎవరికీ అనుమానం రాకుండా విత్తనాలపై ఉల్లిగడ్డలు, నిత్యావసర సరుకులు, వడ్ల బస్తాలు, బిస్కట్ ప్యాకెట్లు తదితర సరుకులు ఉంచి గ్రామాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. గత నెలలో కన్నెపల్లి మండలానికి బొలేరో పికప్ వాహనంలో పైన ఉల్లిగడ్డ బస్తాలు కింద నకిలీ విత్తనాల బ్యాగులు తీసుకెళ్లి రైతులకు విక్రయిస్తున్న సమయంలో కొందరు బెదిరించి కొంత నగదు, 15క్వింటాళ్ల వరకు విత్తనాల బ్యాగులు ఎత్తుకెళ్లినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయం తెలిసిన పోలీసులు 8.10క్వింటాళ్ల విత్తనాలు స్వాధీనం చేసుకుని స్టేషన్ బెయిల్‌పై వదిలేసినట్లు తెలుస్తోంది.

ఆ విత్తనాలు కొనుగోలు చేయొద్దు

నిషేధిత పత్తి విత్తనాలపై నిఘా ఉంచాం. ఎప్పటికప్పుడు టాస్క్‌ఫోర్స్ బృందాలతో తనిఖీలు చేస్తున్నాం. గుర్తింపు లేని విత్తనాలు రైతులెవరూ కొనుగోలు చేయొద్దు.

– జి.కల్పన, జిల్లా వ్యవసాయ అధికారి

న్యూస్‌రీల్

సీఎం పర్యటన విజయవంతం చేయండి



భవనాన్ని సందర్శిస్తున్న మంత్రి, విప్, కలెక్టర్

నస్పూర్: ఈ నెల 9న నస్పూర్ పట్టణంలో సీఎం కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయాన్ని ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఎమ్మెల్సీ విఠల్, కలెక్టర్ బాదావత్ సంతోష్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రేపు జిల్లా పర్యటనకు వస్తున్నారని, బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయం, సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం ప్రారంభిస్తారని, పలు అభివృద్ధి కార్యాక్రమాలకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. నస్పూర్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొంటారని, జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి రంగాన్ని పట్టించుకోని గత పాలకులు

- నేడు అభివృద్ధి చెందిన సాగునీటి రంగం
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్



మందమర్రి డీఈకి మెమెంటో అందజేస్తున్న విప్

చెన్నూర్: సాగునీటి రంగాన్ని గత పాలకులు పట్టించుకోలేదని, నేడు ఒక పక్క మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక సాయిరాం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసి నీటి పారుదల దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చెన్నూర్ నియోజకవర్గ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో తయారు చేసిన ప్రగతి నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 300కు పైగా చెరువులు, కుంటాలు ఉన్నాయని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదంతో చెన్నూర్ ఎత్తిపోతల పథకాన్ని సాధించుకున్నామని తెలిపారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన మందమర్రి డీఈ శారదకు మెమొంటో, ప్రశంసపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ స్వామి, డీఈలు వేణుగోపాల్‌రావు, వెంకటస్వామి, ప్రవీణ్, డీఆర్‌డీవో శేషాద్రి ఏఈ సందీప్ పాల్గొన్నారు.

'హామీలు నెరవేర్చాకే సీఎం రావాలి'



మాట్లాడుతున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాకే సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనకు రావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ప్రధానిగా నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా పెద్దపల్లి పార్లమెంటు సోషల్ మీడియా ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని లయన్స్ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ మాట్లాడుతూ గత తొమ్మిదేళ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, దేశాభివృద్ధికి తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు చేరువయ్యేలా చూడాలని తెలిపారు. సింగరేణి కార్మికులకు 10 వేల కొత్త క్వార్టర్లు, ఉచిత తాగునీరు, కరెంటు, వరద బాధితులకు నష్టపరిహారం ఇస్తామని సీఎం హామీనిచ్చారని తెలిపారు. పార్లమెంట్ కన్వీనర్ మల్లిఖార్జున్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోనుగోటి రంగారావు, పెద్దపల్లి పురుషోత్తం, రజనీష్ జైన్, అందుగుల శ్రీనివాస్, భీమారపు సంపత్, జాడి సత్యనారాయణ, శ్రీవాస్తవ పాల్గొన్నారు.

కులవృత్తుల అభివృద్ధికి కృషి

- దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలన
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్



పాల్గొన్న కలెక్టర్ సంతోష్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: కులవృత్తుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, వెనుకబడిన తరగతుల కులవృత్తులకు రూ.లక్ష ఆర్థిక సహాయం పథకాన్ని ఈ నెల 9 ప్రారంభిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సంగారెడ్డి నుంచి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారులతో బీసీ కులవృత్తుల వారికి ఆర్థిక సహాయం, రెండో విడత గొర్రెల పంపిణీ, ఆరోగ్య దినోత్సవం అంశాలపై సమీక్షించారు. మంత్రి కమలాకర్ మాట్లాడుతూ ఆర్థిక సహాయం పథకంలో భాగంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో అర్హులను గుర్తించాలని తెలిపారు. ప్రతీ నెల దశల వారీగా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, రాహుల్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

తెలంగాణలో నీటికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంపీ వెంకటేష్

లక్సెట్టిపేట: తెలంగాణ రాష్ట్రంలో నీటికి ప్రాధాన్యత కల్పించింది బీఆర్ఎస్ పార్టీయేనని పెద్దపెల్లి ఎంపీ వెంకటేష్ నేత అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ఎస్‌పీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఇరిగేషన్ శాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ప్రాజెక్టుల నిర్మాణాలు, పంట నీటి కాలువలతో రైతులు, ప్రజలకు సాగు, తాగునీటి ఇబ్బందులు లేకుండా చేసిందని అన్నారు. ఎమ్మెల్యే దివాకర్ రావు మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణం వల్ల పట్టణాలకు తాగునీటి ఇబ్బందులు తొలగిపోయాయని తెలిపారు. డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగన్న, మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

పత్తికి మరింత 'మద్దతు'



పత్తి పంట(ఫైల్)

- పంటలకు పెరిగిన కనీస మద్దతు ధరలు
- నువ్వు, పెసర, పత్తి, వేరుశనగ, కందికి అధికం
- వరి ధాన్యానికి నామమాత్రమే..

పెరిగిన ధరలు(క్వింటాల్‌కు రూ.లలో)

పంట	గతేడాది	ఈ ఏడాది	పెరిగింది
పత్తి	6,380	7,020	640
వరి	2,060	2,183	143
కంది	6,600	7,000	400
పెసర	7,755	8,558	803
సోయాబీన్	4,300	4,600	300
నువ్వులు	7,830	8,365	985
మొక్కజొన్న	1,962	2,090	128
వేరుశనగ	5,850	6,377	527
జొన్న	2,990	3,225	235
మినుము	6600	6,950	350
రాగులు	3,578	3,846	268

మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలం సీజన్ ప్రారంభం అవుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం పంటలకు మద్దతు ధర పెంచుతూ రైతులకు తీపి కబురు అందించింది. 17 పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు పెంచుతూ గురువారం కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పత్తి, వరి సోయాబీన్, కంది పంటలు అధికంగా సాగవుతుండగా.. పెంచిన ధరలు పత్తి, సోయాబీన్, కంది, పెసర పంటలకు కాస్త ఊరటనివ్వగా వరి పంట ధర అన్నదాతను నిరాశకు గురి చేసింది. ఉమ్మడి జిల్లాలో 17.20 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. అధికంగా నువ్వు, పెసర పంటలకు పెంచారు. కమిషనర్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్(సీఏసీపీ) సూచించిన ధరలు సాగుకయ్యే ఖర్చు కన్నా తక్కువగానే ఉన్నాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకు అనుగుణంగా ధరలు పెంచాలని గత కొద్ది రోజుల క్రితం సీఏపీసీకి విజ్ఞప్తి చేసింది. రైతు కమిటీల సిఫారసులు ప్రకారం సాగుకు చేసే ఖర్చుకు అదనంగా మరో 50 శాతం కలిపి ధర ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయింది.

ఏటేటా పెరుగుతున్న పెట్టుబడి

జిల్లాలో 1.60లక్షల మంది రైతులు ఉండగా.. 3.65 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ప్రధానంగా పత్తి, వరి తదితర పంటల సాగు విస్తీర్ణం ఉంటుంది. రెట్టింపైన పెట్టుబడులు రైతులకు కన్నీరు తెప్పిస్తున్నాయి. పెట్టుబడికి, రాబడికి పొంతనలేని దుస్థితి. ఏటా పెరుగుతున్న ఉత్పత్తి వ్యయం రైతులను అప్పుల సుడిగుండలో చిక్కుకునేలా చేస్తోంది. ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు విరుచుకు పడుతుంటే మరో వైపు ప్రభుత్వం చిన్నచూపుతో పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక రైతుకు సాగు భరోసా లేకుండా పోతుంది. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల ధరలు, కూలి, వ్యవసాయ యంత్రాల ధరలు ఏటేటా భారీగా పెరుగుతున్నాయి. ఎకరం వరి సాగు పెట్టుబడి రూ.30 వేలు, పత్తి సాగు రూ.40 నుంచి రూ.45 వేలు, కంది రూ.30 వేలు, సోయాబీన్ రూ.20 నుంచి రూ.25 వేలు, మొక్కజొన్న రూ.20 వేల వరకు వరకు ఖర్చు అవుతుంది. దీంతోపాటు ఈ ఏడాదైన పత్తి క్వింటాలకు రూ.8 వేలు, వరికి రూ.3 వేలు, సోయాకు రూ.5 వేల వరకు చెల్లించాలని పలు రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పెట్టుబడులు ప్రభుత్వానికి వివరించినా ఫలితం లేకుండా పోయింది.

ఈ ధర గిట్టుబాటు కాదు..



పోయిన ఏడాది కంటే ఈ ఏడాది కూలీలు, ట్రాక్టర్ కిరాయి, పురుగు మందుల ధరలు బాగా పెరిగినయి. వరికి రూ.3 వేలు పెడితే గిట్టుబాటు అవుతుంది. ఏటా వందా రెండు వందలు పెంచుతున్నారు. పెట్టుబడి వేలకు వేలు పెరుగుతుంది. ఈ ఏడాది కూడా పెంచిన ధర నిరాశే పరిచింది.

– ఎం.శంకర్, గ్రామం: ఘన్‌పూర్, మం: నెన్నెల

పత్తికి రూ.8 వేలు ధర ఉండాలి



ఎకరం పత్తి సాగుకు రూ.40 వేల ఖర్చు అవుతుంది. విత్తనాలు, పురుగు మందు, కూలీల ధరలు బాగా పెరిగినయి. పోయిన ఏడాది భారీ వర్షాలతో పంట నష్టపోవాల్సి వచ్చింది. పెట్టుబడి పెరిగి దిగుబడి తగ్గి నష్టపోవాల్సి వచ్చింది. ఈ ఏడాదైన రూ.8 వేలు ధర ఉంటుందని అనుకుంటే రూ.7 వేలకు పెంచిండ్రు. ఈ ధర గిట్టుబాటు కాదు.

– భీమరాజుల వెంకన్న, నెన్నెల

బహిరంగ సభ వేదిక పనులు షురూ



పనులు ప్రారంభిస్తున్న బాల్క సుమన్

నస్పూర్: పట్టణ పరిధిలో నూతన కలెక్టరేట్ భవన నిర్మాణం సమీపంలో ఈ నెల 9న నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభ స్థలం ప్రాంగణం, వేదిక ఏర్పాటు పనులను ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేత, మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే అరవిందర్‌రెడ్డిలతో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం సభాస్థలి, సభావేదిక ఏర్పాట్లను పరిశీలించారు. వేదిక వద్ద ఏర్పాటు చేయనున్న గ్యాలరీ, పార్కింగ్ స్థలాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ట్రాఫిక్ ఆంక్షలు

నస్పూర్: కలెక్టరేట్ భవనం ప్రారంభం, పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు శుక్రవారం సీఎం కేసీఆర్ నస్పూర్ పట్టణంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. గోదావరిఖని, చెన్నూర్ నుంచి మంచిర్యాలకు వెళ్లే వాహనదారులు శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద గల జాతీయ రహదారి ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా క్యాతన్‌పల్లి గాంధారి వనం నుంచి మంచిర్యాలకు చేరుకోవాలని సూచించారు. మంచిర్యాల వైపు నుంచి శ్రీరాంపూర్, చెన్నూర్, గోదావరిఖనికి వెళ్లే వాహనదారులు క్యాతన్‌పల్లి గాంధారి వనం వద్ద గల జాతీయ రహదారి ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద గల జాతీయ రహదారి ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా వెళ్లాలని సూచించారు.

ఊరూరా చెరువుల పండుగ



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఊరూరా చెరువుల పండుగను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని షాదీఖానా ఫంక్షన్‌హాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, జిల్లా పంచాయతీ అధికారితో కలిసి తహసీల్దార్లు, మండల పరిషత్, పంచాయతీ, వ్యవసాయ అధికారులతో ఊరూరా చెరువుల పండుగపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చెరువుల పండుగను అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. చెరువు కట్టను అందంగా అలంకరించాలని, బోనాలతో డప్పు వాయిద్యాల నడుమ చెరువు వద్ద చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తొమ్మిదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధిని తెలియజేయాలని అన్నారు. బతుకమ్మ, కోలాటం సంబంధిత సామగ్రి అందుబాటులో ఉంచాలని, బతుకమ్మ, బోనాలకు హాజరయ్యే వారి వివరాలతో జాబితా తయారు చేసుకోవాలని తెలిపారు. ఏర్పాట్లకు ప్రతీ మండల పరిషత్ అభివృద్ధి అధికారికి రూ.25 వేల అందజేశామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ తీగ తెగిపడి వృద్ధురాలు మృతి

దండేపల్లి(మంచిర్యాల): విద్యుత్ తీగ తెగిపడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై కుందారపు ప్రసాద్, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దుర్గం చిన్నక్క (70) బుధవారం ఉదయం ఇంటిముందు వాకిలి ఊడుస్తుండగా ఎల్‌టీ విద్యుత్ లైన్ తీగ తెగింది. గమనించని వృద్ధురాలు తీగను తాకడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి మనుమడు అర్జున్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఓబీ లక్ష్యాన్ని పెంచాలి

శ్రీరాంపూర్: ఓపెన్ కాస్ట్ గనుల్లో ఓవర్‌బర్డెన్ (ఓబీ) వెలికితీత లక్ష్యాలను మరింత పెంచాలని కంపెనీ డైరెక్టర్లు ఎస్.బలరాం (ఫైనాన్స్, పర్సనల్), జి.వెంకటేశ్వర్‌రెడ్డి (ప్రాజెక్ట్, ప్లానింగ్) సూచించారు. బుధవారం వీడియో కాన్ఫర్ కాన్ఫరెన్స్ ద్వారా ఏరియాల జీఎంలతో మాట్లాడారు. రెండు ఓసీపీల్లో నిర్దేశించిన ఓబీ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు.

చింతగూడ ఆలయంలో చోరీ

జన్నారం(ఖానాపూర్): మండలంలోని చింతగూడ లక్ష్మీదేవి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు ఆలయ ఈవో రమేశ్ తెలిపారు. బుధవారం ఉదయం పూజ చేసేందుకు అర్చకుడు వెళ్లి చూడగా నాలుగు హుండీలలో ఒకటి పగులగొట్టి ఉంది. అందులో సగం నగదు తీసుకుని మిగతాది వదిలేశారు. విషయాన్ని ఆలయ ఈవో రమేశ్‌కు, పాలక వర్గానికి తెలియజేయడంతో పోలీసులకు సమాచారం అందించారు. హుండీలో సుమారు రూ.90 వేల వరకు నగదు ఉంటుందని ఈవో రమేశ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తానాజీ నాయక్ తెలిపారు.

సర్పంచ్ కుమారుడిపై అట్రాసిటీ కేసు నమోదు

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని డబ్బా గ్రామ సర్పంచ్ కుమారుడు అబ్దుల్ రషీద్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై యాదవ్ తెలిపారు. తమను కులం పేరుతో దూషించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడ్డాడని గ్రామానికి చెందిన కుమురం నారాయణ మంగళవారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

కార్యదర్శి సంతకం ఫోర్జరీ!

జన్నారం(ఖానాపూర్): ఇంటి రుణం కోసం కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన జన్నారం మండలంలోని ఇందన్‌పల్లిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదే గ్రామంలో అసైన్డ్ భూమిలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఓ ప్రైవేట్ బ్యాంకులో రుణం పొందేందుకు సంప్రదించగా ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లు కావాలనడంతో గ్రామ కార్యదర్శి బాపురావును అడిగాడు. తాను ఆ సర్టిఫికెట్ ఇవ్వలేనని తెలపడంతో స్టాంపులు తయారు చేసుకుని కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి డాక్యుమెంట్లను బ్యాంకులో అప్పగించాడు. బ్యాంకు సిబ్బంది ఈ నెల 3న ఇందన్‌పల్లికి వచ్చి కార్యదర్శిని సంప్రదించగా సర్టిఫికెట్ తాను ఇవ్వలేదన్నాడు. దీంతో బ్యాంకు అధికారులు రుణం రద్దు చేశారు. గ్రామంలోని కొందరు ఈ విషయం బయటకు రాకుండా చూడటానికి కార్యదర్శిపై ఒత్తిడి పెంచినట్లు తెలిసింది. కార్యదర్శి బాపురావును సంప్రదించగా సంతకం ఫోర్జరీ చేసింది నిజమేనని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

భార్య గొంతుకోసి హత్యాయత్నం

రామకృష్ణాపూర్: భార్యను గొంతుకోసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన గంగాకాలనీలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన రిటైర్డ్ కార్మికుడు అన్నెడి బుచ్చిరెడ్డి, అతని భార్య మల్లవ్వకు తరచూ గొడవలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలోనే బుచ్చిరెడ్డి కత్తితో మల్లవ్వ గొంతు కోశాడు. తీవ్రంగా గాయపడడంతో స్థానిక సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యంకోసం మంచిర్యాలకు రెఫర్ చేశారు. ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

యువకుడి అప్పగింత

భీమిని(బెల్లంపల్లి): పారిపోయిన యువకుడి ఆచూకీ కనుక్కుని బుధవారం తండ్రికి అప్పగించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. పెద్దపేటకు చెందిన పర్ధాన్ రామకృష్ణ మద్యానికి బానిస కావడంతో తండ్రి అశోక్ మందలించాడు. దీంతో మే 24న కెరమెరిలో ఉంటున్న బాబాయి ఇంటికి వెళ్లాడు. 26న ఇంటికి వెళ్తానని చెప్పి కెరమెరి నుంచి ఆటోలో బయలుదేరాడు. ఇంటికి రాకపోవడంతో జూన్ 2న అశోక్ భీమిని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మంచిర్యాలలోని హోటల్ పనిచేస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు యువకుడిని తీసుకువచ్చి తండ్రికి అప్పగించారు.

సీఎం సారూ.. పట్టించుకోండి

ప్రజలకు తాగు, సాగు నీటి అవసరాలు తీరుస్తున్న ఎల్లంపల్లి (శ్రీపాదసాగర్) ప్రాజెక్టు పరిసరాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఈప్రాంత వాసులు కోరుతున్నారు. 30 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో బోటింగ్ సౌకర్యం కల్పిస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. అంతేకాకుండా పర్యాటకులు సైతం మరింత ఆహ్లాదం పొందనున్నారు. పచ్చదనం పెంపొందించేలా ఎల్లంపల్లి దిగువన ఐటీడీఏ ఆధ్వర్యంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన పార్క్ ప్రస్తుతం కనుమరుగైంది. ఈ నెల 9న ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా పర్యటన నేపథ్యంలో వీటిపై ప్రకటన చేయాలని కోరుతున్నారు.


ఎల్లంపల్లి ప్రాజెక్టు

- ఏటా 'ఎల్లంపల్లి'కి పెరుగుతున్న సందర్శకులు
- కానరాని బోటింగ్ సౌకర్యం
- కనుమరుగైన పార్కు
- నిధులు కేటాయించాలని స్థానికుల వేడుకోలు
- రేపు మంచిర్యాల జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల–పెద్దపల్లి జిల్లాల మధ్య ఉన్న గోదావరినదిపై ప్రాణకోటికి కల్పవల్లిగా ఎల్లంపల్లి(శ్రీపాదసాగర్) ప్రాజెక్టు నిర్మించారు. జలయజ్ఞంలో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాజెక్టుకు రూపకల్పన చేయగా 2008 జూలై 28న శంకుస్థాపన చేశారు. ప్రజలకు సాగు, తాగునీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాలను సైతం ప్రాజెక్టు తీరుస్తోంది. రామగుండం ఎన్టీపీసీ, రాజధాని ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడుతోంది.

సాగు.. తాగునీరు

62 గేట్లతో నిర్మాణం చేపట్టిన ప్రాజెక్ట్‌ను దాదాపు రూ.4,950 కోట్లతో రెండేళ్ల క్రితం పూర్తి చేశారు. ప్రాజెక్ట్ కింద 7,500 ఎకరాల సాగుభూమి ముంపునకు గురి కాగా 1.118 కిలో మీటర్ల మేర 4 లక్షల 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. సుజల స్రవంతి పథకం కింద హైదరాబాద్‌కు రోజుకు 220 టీఎంసీల నీటిని తరలిస్తున్నారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, రామగుండం, మంథని నియోజకవర్గాల్లోని ప్రజలకు ఇంటింటికీ గోదావరి తాగునీరు సరఫరా అవుతోంది.

పర్యాటక ప్రదేశమే...

ఎల్లంపల్లి ప్రాజెక్ట్, పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పం ముందుకు సాగడం లేదు. జాతీయ రహదారికి కేవలం మూడు కిలో మీటర్ల పరిధిలో గోదావరి నదిపై 62 గేట్లతో భారీ ప్రాజెక్ట్ నిర్మాణం జరిగింది. నిత్యం నిండు కుండలా దర్శనమిస్తున్న ప్రాజెక్ట్ పర్యాటకులను కనువిందు చేస్తోంది. ప్రాజెక్ట్ వద్ద ఏర్పాటు చేసిన సుందరమైన పార్కు చూపరులను ఆకట్టుకుంటోంది. 30 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న బ్యాక్ వాటర్‌లో బోటింగ్ ఏర్పాటు చేస్తే పర్యాటకులకు మరింత ఆహ్లాదం పంచుతుంది. ఉపాధి అవకాశాలు సైతం పెరుగుతాయి.

సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలి

2019 ఫిబ్రవరిలో మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు చేతుల మీదుగా హాజీపూర్ మండలంలోని గుడిపేట జాతీయ రహదారి నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్ట్ మీదుగా పెద్దపల్లి జిల్లాలోని ఎల్లంపల్లి వరకు బీటీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయగా దాదాపు రూ.8 కోట్ల 98 లక్షల 50 వేలతో పనులు పూర్తి చేశారు. జాతీయ రహదారి నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వరకు రోడ్డుకు మధ్యలో డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తే పర్యాటకులను విశేషంగా ఆకట్టుకోనుంది.

కనుమరుగైన పార్కు

ఎల్లంపల్లి దిగువ భాగాన ఏర్పాటు చేసిన పార్కు ఇప్పుడు కనుమరుగైంది. ఐటీడీఏ ఆధ్వర్యంలో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పార్కును అందంగా తీర్చిదిద్దినప్పటికీ ప్రస్తుతం కనుమరుగైంది. ప్రాజెక్ట్ పరిసరాలన్నీ పచ్చదనం పరుచుకునేలా చేస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదు. ప్రాజెక్ట్‌లో బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేసి టూరిజంగా కూడా అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీ కాస్త కోటిలింగాలకు వెళ్లింది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌కు మంజూరైన మర పడవ(బోట్) కోటి లింగాలలో పర్యాటకులకు ఆహ్లాదం పంచుతోంది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ టూరిజంగా అభివృద్ధి సాధించాలంటే సీఎం కేసీఆర్ దీనిపై ప్రకటన చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

కలగానే ప్రభుత్వ జూనియర్ కళాశాల

- ప్రభుత్వ స్థలాలు ఉన్నా తప్పని ఎదురుచూపులు
- ఉన్నత చదువులకు దూరమవుతున్న విద్యార్థులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్‌ను 2016లో మండలంగా ప్రకటించారు. ఆరేళ్లు కావస్తున్నా మండలంలో జూనియర్ కళాశాల అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులకు ఉన్నత చదువులు అందని ద్రాక్షగా మారాయి.

విద్యార్థులకు తప్పని తిప్పలు

హాజీపూర్ మండలంలో 17 గ్రామ పంచాయతీలు, 21 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 5 ప్రభుత్వ ఉన్నత పాఠశాలు, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాల, 10 ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో రెండు పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఉండగా ఏటా 500ల మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఇంటర్ చదివేందుకు మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో ఎంతో వ్యయప్రయాసలకోర్చి పది నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంచిర్యాల, లక్సెట్టిపేటకు వెళ్తున్నారు. ఆర్థికభారంతో కొంతమంది విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపేసి కూలి పనులకు వెళ్తున్నారు. శుక్రవారం సీఎం కేసీఆర్ జిల్లాకు రానున్న నేపథ్యంలో ఈ విద్యాసంవత్సరంలోనైనా హాజీపూర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి తమ ఇబ్బందులు తీర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.


హాజీపూర్ మండల కేంద్రం

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


సాగర్ మృతదేహం

కౌటాల(సిర్పూర్): ప్రేమించిన అమ్మాయి తనకు దక్కదేమోనని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎ స్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకా రం కోయగూడ గ్రామానికి చెందిన నైతం సాగర్(22)కు వివాహం జరిపేందుకు తల్లిద ండ్రులు సంబంధాలు చూస్తున్నారు. ఈ క్రమంలో తాను ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నానని, తనకు పెళ్లి సంబంధాలు చూడవద్దని తల్లిదండ్రులను కోరాడు. సొంత నిర్ణయాలు తీసుకోవద్దని, తల్లిదండ్రులు చెప్పడంతో మనస్తాపంతో మంగళవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిర్పూర్(టి) ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. బుధవారం మృతుని తండ్రి నైతం జగన్నాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న జక్కుల రాజేశం

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని తెలంగాణ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కుల రాజేశం డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైపర్ కమిటీ వేతనాలను చెల్లించకపోవడం వలన శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. సింగరేణి వ్యాప్తంగా 26 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి శ్రమకు తగ్గ ఫలితం దక్కడంలేదన్నారు. ఓబీ సంస్థలకు లేబర్ లైసెన్స్ కలిగి ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, స్థానికులకు ఓపెన్ కాస్ట్ పనుల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఈ నెల 9న నస్పూర్‌కు వస్తున్న సీఎం కేసీఆర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్మడి శ్రీనివాస్, నాయకులు గణపతి, సత్తన్న, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


నిండా ముంచిన వైన్ యాప్!

- పెట్రేగిపోతున్న ఆన్‌లైన్ మోసాలు
- యాప్‌ల పేరిట బురిడీ కొట్టిస్తున్న మోసగాళ్లు

చెన్నూర్: సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త యాప్‌లతో లాభాల ఆశలు చూపి కోట్లు కొల్లగొడుతున్నారు. వైన్‌యాప్ పేరుతో చెన్నూర్ మండలానికి చెందిన అమాయకులను టార్గెట్ చేసి మోసాలకు పాల్పడుతున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొంతమంది వైన్ వ్యాపారం పేరుతో యాప్ ఏర్పాటు చేశారు. వచ్చిన ఆదాయాన్ని పెట్టుబడిదారులకు రెట్టింపు లాభాలను పంపిస్తామని ఆశ చూపారు. కొత్తలో పెట్టిన పెట్టుబడికి లాభాలను పంపించి నమ్మించారు. దీంతో చైన్ సిస్టమ్ ద్వారా లక్షలాది మంది యాప్‌లో చేరారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందని ఆశపడ్డ ప్రభుత్వ, ప్రైవేట్, సింగరేణి ఉద్యోగులతో పాటు చిరువ్యాపారులు లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. బిచానా ఎత్తేయడంతో లబోదిబో మంటున్నారు. జిల్లాలోని చెన్నూర్, కోటపల్లి, మంచిర్యాల, బెల్లంపల్లి, సింగరేణి ప్రాంతానికి చెందిన వారు పెద్ద ఎత్తున ఉన్నట్లు తెలిసింది.

లాభాల ఆశతో...

చెన్నూర్ మండలం గంగారం గ్రామానికి చెందిన నరిశెట్టి రాకేశ్ గత నెల 18న వైన్ యాప్‌లో చేరి రూ.37,500 పెట్టుబడి పెట్టాడు. 19 నుంచి రోజుకు 2,268 చొప్పున పది రోజుల పాటు రూ.22,680 వచ్చాయి. దీంతో అతని ఆశకు అంతులేకుండా పోయింది. తన భార్య పేరిట మరో రూ.55వేలు పెట్టాడు. పది రోజుల పాటు లాభాలను పంపించిన నిర్వాహకులు గత నెల 30 నుంచి ఆపేశారు. యాప్‌లో డబ్బులు ఫెయిల్ అని కన్పించడం ప్రారంభించింది. మోసపోయానని గుర్తించాడు. జిల్లాలో రాకేశ్ లాంటి వారు వేలాది మంది ఉన్నారు.



రూ.55 వేలు చెల్లించిన గౌతమి



వైన్ యాప్‌లో ఉన్న మోడల్స్

నాలా ఎవరూ మోసపోకండి



చిరువ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. ఈజీమనీకి ఆశపడి మోసపోయా. సైబర్ నేరగాళ్లు అమాయకులకు డబ్బు ఆశచూపి దండుకుంటున్నారు. నాలా చాలామంది మోసపోయారు. ఎవరూ బయటికి రావడం లేదు. మరికొంత మంది మోసపోవద్దని ముందుకు వచ్చా. – నరిశెట్టి రాకేశ్, గంగారం, చెన్నూర్

అత్యాశకు పోవద్దు



సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారు. డబ్బులు ఎక్కువగా ఇస్తామంటే అత్యాశకు వెళ్లి మోసపోవద్దు. సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. ఇప్పటి వరకు వైన్ యాప్ బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదు. పోలీసులను సంప్రదిస్తే పరిశీలిస్తాం. – వాసుదేవరావు, సీఐ చెన్నూర్

అధికారుల సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అధికారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికారుల సంఘం బెల్లంపల్లి ఏరియా అధ్యక్షుడు కేహెచ్‌ఎన్ గుప్తా బుధవారం సింగరేణి డైరెక్టర్(పీఅండ్‌పీ) వెంకటేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీలో పని చేసే జనరల్ షిఫ్ట్ అధికారులకు ఏసీ బొలెరో వాహనాలు ఇవ్వాలని, జీఎం ఆఫీస్‌లో పనిచేసే హెచ్‌ఓడీలకు ఏసీ చాంబర్‌ను ఏర్పాటు చేయాలని, యూనిట్ లెవల్‌లో పనిచేసే అధికారులకు ఫీల్డ్ అలవెన్సు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీఎం దేవేందర్, ఏజీఎం తిరుమల్ రావు, పీవో ఎస్.సత్యనారాయణ, డీజీఎం సతీష్‌బాబు, సర్వే అధికారి చంద్రశేఖర్, పీఈ రాజాజీ, మేనేజర్ ప్రవీణ్ ఫటింగ్, డీవైపీఎం వేణు, తదితరులు పాల్గొన్నారు.


డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అధికారులు

'ఎమ్మెల్యే చిన్నయ్యను అరెస్ట్ చేయాలి'

బెల్లంపల్లిరూరల్: ఆరిజిన్ డెయిరీ భాగస్వామి బోడపాటి షేజల్‌ను లైంగికంగా వేధించి ఆమె ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను పోలీసులు వెంటనే అరెస్ట్ చేయాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రొడ్డ శారద, టీపీసీసీ సభ్యుడు చిలుమల శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మహిళలపై ఇంతటి ఘోరం జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయకుంటే క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.

రక్షణ పరికరాలు ధరించాలి

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఉద్యోగులు విధి నిర్వహణలో రక్షణ పరికరాలు ధరించాలని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. బుధవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ శాఖ అధికారులతో గనుల్లో తీసుకుంటున్న రక్షణ చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డైరెక్టర్ మైన్స్(డీఎంఎస్) ఎన్.నాగేశ్వరరావు, డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్(డీడీఎంఎస్) కే ప్రేమ్‌కుమార్, బీ.వెంకన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ భూగర్భ గనులు, ఉపరితల గనుల్లో ఉద్యోగులు సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ పాటిస్తూ పనిచేయాలన్నారు. ప్రమాద రహిత సింగరేణిగా తీర్చిదిద్దడానికి రక్షణ నియమాలు పాటించాలన్నారు. సమావేశంలో డీఎంఎస్ నాగేశ్వరరావు, ఏరియా ఇంజినీర్ రమేశ్‌బాబు, ఓసీపీ అధికారులు ఎం.శ్రీనివాస్, వి పురుషోత్తం, ఏజెంట్లు ఏవి రెడ్డి, రాముడు, అధికారుల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ ఖాదిర్, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

ఆర్కే 7గనిని తనిఖీ చేసిన డీడీఎంఎస్

ఆర్కే 7 గనిని డీడీఎంఎస్ ప్రేమ్ కుమార్ తనిఖీ చేశారు. ఏరియా రక్షణాధికారి శ్రీధర్, గ్రూప్ ఏజెంట్ రాముడు, గని మేనేజర్ సాయి ప్రసాద్ గనిలోకి దిగి 2ఏఎన్ 22 ప్యానెల్ పని స్థలాల్లో తనిఖీ నిర్వహించారు. గని రక్షణాధికారి రవిశంకర్, అండర్ మేనేజర్ రమేశ్, ఎలక్ట్రికల్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, సర్వేఆఫీసర్ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

11న 'ప్రజాగర్జన'కు తరలిరావాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 11న కొత్తగూడెంలో నిర్వహించనున్న ప్రజాగర్జన బహిరంగసభకు సింగరేణి కార్మికులు అధికసంఖ్యలో తరలిరావాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. బుధవారం ఎస్సార్పీ 1 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంచిర్యాల నుంచి ప్రత్యేక రైలు ఏర్పాటు చేశామన్నారు. కోల్ ఇండియాలో అక్కడి కార్మికులకు పెర్క్స్‌పై ఆదాయ పన్ను యజమాన్యమే చెల్లిస్తుందని, సింగరేణిలో కూడా యజమాన్యమే భరించాలని డిమాండ్ చేశారు. దీనిపై ముఖ్యమంత్రి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు ఎస్కే బాజీ సైదా, కే వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య కిషన్ రావు, నాయకులు చంద్రమోహన్, గునిగంటి నర్సింగ్ రావు, పిట్ సెక్రెటరీ దాడి రాజయ్య, నాయకులు అఫ్రోజ్ ఖాన్ మురళీచౌదరి లక్ష్మణ్, అనంత రెడ్డి, వేణు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

సీఎం హామీలు అమలు చేయాలి

- సీఐటీయూ కేంద్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీరాంపూర్‌లో జరిగిన బహిరంగ సభలో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ కేంద్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు డిమాండ్ చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీబీజీకేఎస్‌ను గెలిపిస్తే రెండు పేర్లతో ఉన్న ఉద్యోగుల పేర్లను క్రమబద్ధీకరిస్తామని, కార్మికులకు సొంతింటి పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చి మరిచారన్నారు. ఖాళీగా ఉన్న క్వార్టర్లను కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని, హైపవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలని, డిపెండెంట్ పిల్లల వయస్సు 35 నుంచి 45కు పెంచాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్‌లో ఆర్‌ఎల్‌సీ సమక్షంలో జరిగిన ఒప్పందాలను కూడా కంపెనీ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. సమావేశంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి భాగ్యరాజ్, నాయకులు శంకర్, శ్రీనివాస్, రాజయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంద నర్సింహారావు